# 17977 వద్ద నిరోధం!




**సమీక్ష** : అంతర్జాతీయంగా గత వారాల్లో ర్యాలీని దృష్టిలో ఉంచుకొని గత వారం మార్కెట్ లాభాల స్వీకరణ, స్థిరీకరణ దిశగా పయనించింది. డాలరుతో పోలిస్తే యెన్ పెరగడాన్ని నియంత్రించడం కోసం జపాన్ పాలకవర్గాల జోక్యం చేసుకోవడం మార్కెట్ సెంటిమెంటుపై పని చేసింది. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ బలహీనంగా ప్రారంభమైంది. యురోపియన్ యూనియన్ ప్యాకేజీపై గ్రీస్ ప్రధాని ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లాలనడం అంతర్జాతీయ, దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. దేశీయంగా సేవా రంగంలో మందగమనం, నిరుత్సాహకర వాహన విక్రయాల గణాంకాలు, ఆహార ద్రవ్యోల్బణం పెరగడం వంటి కారణాలతో సెన్సెక్స్ దిగువకు వచ్చింది. తరువాత ఐరోపా మార్కెట్ల సానుకూలతలతో కాస్త కోలుకొంది. వారాంతానికి 242 పాయింట్లు కోల్పోయి, 17563 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐల పనితీరు** విదేశీ సంస్థాగత మదుపుదారులు (ఎఫ్ఐఐలు) రూ. 3,174.20 కోట్ల నికర కొనుగోళ్లు జరిపారు. కాగా మ్యూచువల్ ఫండ్లు మాత్రం రూ. 749 కోట్ల విక్రయాలు చేశాయి.

**రంగాల వారీగా** అక్టోబరులో వాహన విక్రయాల గణాంకాలు మెరుగవకపోవడంతో వాహన రంగ షేర్లు డీలా పడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో బలహీనతలకు తోడు ముడి చమురు ధరలు పెరగడంతో చమురు-గ్యాస్ సూచీ కూడా నష్టాల్లో ముగిసింది. వస్తు (ఎఫ్ఎమ్‌సీజీ), విద్యుత్తు రంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. స్థిరాస్తి రంగ స్క్రిప్‌లను మదుపర్లు తక్కువ స్థాయుల్లో కొనడానికి ఇష్టపడడంతో ఈ సూచీ కూడా లాభపడింది.

**శుక్రవారానికి లాభపడ్డ, నష్టపోయిన స్క్రిప్‌ల నిష్పత్తి 5:4గా నమోదవడం.. మార్కెట్ స్థిరీకరణ దశలో ఉన్నట్లు సూచిస్తోంది.**

**భవిష్యత్ అంచనా** సెన్సెక్స్‌కు 17977 తక్షణ నిరోధ స్థాయిగా కనిపిస్తోంది. 17200-17300 శ్రేణి తక్షణ మద్దతు స్థాయిలుగా ఉండొచ్చు. 17200-17977 మధ్య మార్కెట్ స్థిరీకరణ దశలో కొనసాగినంత కాలం ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలు కనిపించవచ్చు. 7, 10 తేదీల్లో మార్కెట్లకు సెలవులు కావడంతో ఈ వారం మూడు రోజులే ట్రేడింగ్ జరగనుంది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన షేర్లలో చలనాలను అంచనా వేయొచ్చు.

**ప్రభావిత అంశాలు** ఆహార ద్రవ్యోల్బణం పెచ్చుపెరుగుతుండడం, మరో మారు పెట్రో ధరలు పెరగడంతో మార్కెట్ లాభాలు పరిమితంగానే ఉండొచ్చు. ఈ నెల 12న విడుదలయ్యే పారిశ్రామికోత్పత్తి గణాంకాల నేపథ్యంలో ఎంపిక చేసిన స్క్రిప్‌లపై కన్నేయవచ్చు. రూపాయి మారకం విలువ మరింత క్షీణిస్తే దిగుమతి ఆధారిత రంగాలపై ఒత్తిడి తగ్గవచ్చు. అంతర్జాతీయంగా చూస్తే గ్రీస్ పరిణామాలు, ముడి చమురు ధరలపై మార్కెట్ దృష్టి సారించవచ్చు.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 17813, 17977, 18189 **తక్షణ మద్దతు స్థాయిలు:** 17474, 17350, 17212

**17977 స్థాయి వద్ద మార్కెట్ నిరోధం కొనసాగవచ్చు.**

*– సతీశ్ కంతేటి, జెన్‌మనీ*